# పేయింగ్ గెస్ట్

ఏదైనా నమ్మేవాడేమోగాని పరమేశం పార్టీ ఇస్తున్నాడంటే మాత్ర౦ నమ్మశక్యం కావడంలేదు అవతారానికి.

పరమేశం ఆఫీసులో జూనియర్ అసిస్టెంటుగా అపాయింటై రెండు వసంతాలు గడిచాయి.

బ్రహ్మచారే గాని పరమలోభి. హోటల్‌లో తింటే బడ్జెట్ ఎక్కువై పోతుందని అకౌంటెంట్ ప్రభాకర్ ఇంట్లో పేయింగ్ గెస్టుగా చేరిపోయాడు. రెండు పూటలాసుష్టుగా భోంచేసి నూటయాభై రూపాయలతో చెయ్యి కడిగేసుకుంటున్నాడు. జీతంలో సగం వెనకవేసుకోవడం మిగిలిన దానితో పబ్బం గడుపుకోవడం అతడి ప్రవృత్తి.

ఎంతో క్లోజుగా వున్నా ఏనాడూ అవతారానికి కప్పు కాఫీ పోయలేదు. మరి ఈ రోజు గ్రాండ్‌పార్టీ ఇస్తానంటూ రమ్మంటున్నాడు. ఆ మాటలు తన కర్ణభేరిని తాకడంతో పది లక్షలు లాట్రీ తగిలినట్లైంది. వచ్చిన అవకాశం వదలుకోవడం ఇష్టంలేక సరే పదమన్నాడు.

రాత్రి ఎనిమిది అయింది. పరమేశం, అవతారం ఓ స్టార్ హోటల్లో అడుగుపెట్టారు. రంగు రంగుల 'విద్యుద్దీపాలతో ఇంద్రభవనంలా మెరిసిపోతోందా హోటలు.

ఇరువురు బార్ అండ్ రెస్టారెంట్ విభాగంలో కెళ్ళి ఒక టేబుల్ వద్ద కూర్చున్నారు. అక్కడ డిమ్‌లైట్ల కాంతిలో ఖరీదైన వ్యక్తులు మధుపానీయాలు సేవిస్తూ మత్తుగా గోచరిస్తున్నారు. బేరర్సు మల్లెపువ్వు రంగు యూనిఫారంలో అతిథుల అడుగులకు మడుగులొత్తుతూ వారికి ఎప్పుడేం కావాలో తెలుసుకుని

సమకూరుస్తున్నారు.

అవతారానికి అప్పుడప్పుడు మందు పుచ్చుకోవడం అలవాటున్నా బార్ కెళ్ళడం అదే ప్రథమం. చుక్కల హోటళ్ళలో బిల్లు ఎంత అవుతుందో పరమేశానికి అవగాహన వున్నట్లు లేదేమోననిపించింది. అందుకే సొమ్ముందా? అన్నట్లు అతడి వంకే చూసాడు. మరేం భయంలేదన్నట్లు అభయమిచ్చాడు పరమేశం.

'సార్'మెనుకార్డు చేతికిచ్చి అత్యంత వినయంగా నిలబడ్డాడు బేరరు.

అందులో వున్న ఐటెమ్సునన్నిటినీ మీద నుండి కిందవరకు ముమ్మారు చదివాడు పరమేశం. వాటిలో ఒక్కటీ తెలిసి ఛావలేదు. మరీ జాగుచేస్తే అపహాస్యమౌతుందనుకుని మెనుకార్డు బల్లమీద పడేసి విస్కీ ఆర్డరు చేశాడు. దాంతోపాటు చికిన్ రోస్ట్.

క్షణాలమీద మందు సిద్ధమైంది. బాటిల్‌లోని విస్కీని గ్లాసుల్లోకి వంచి సోడా కలిపాడు పరమేశం.

'చీర్స్' అంటూ గ్లాసులు పెదవులు కంటించారు.

ఒక రౌండ్ పూర్తి అయింది.

తనను పార్టీకి పిలవడంలో గల ఆంతర్యం అవతారానికి అర్థం కావడంలేదు. తనతో ఏ అవసరం పడకుండా అంత ప్రేమగా పిలిచి మందు కొట్టించడు.

ఇక తన మనసులో మాట ఎలా బయట పెట్టాలో కొరుకుడు పడటం లేదు పరమేశానికి. ఏది ఏమైనా తనకిప్పుడు అతడి సలహా కావాలి. అతడి అండ ఎంతైనా అవసరం.

"ఇంతకూ పార్టీ ఇవ్వడానికి గల అకేషను ఏమిటో చెప్పావుకాదు" అన్నాడు అవతారం, ముసుగులో గుద్దులాట ఎందుకని.

"మరేం లేదు గురూ నీ సజిషన్‌కావాలి బార్లో అయితే ఫ్రీగా మాట్లాడుకోవచ్చు కదా అని నిన్నిక్కడకు తీసుకొచ్చాను" అన్నాడు పరమేశం.

ప్రశ్నార్థకంగా ముఖం పెట్టాడు అవతారం.

"మరేంకావాలో ఆదేశించండి" అన్నట్లు బుద్ధిగా నిలబడ్డాడు బేరరు.

మరొక్కప్పుడైతే వాడి వినయానికి మెచ్చుకుని టిప్పు కొట్టించేవాడే పరమేశం. ఇప్పుడు వాడు అక్కడనుండి నిష్క్రమిస్తే బావుండుననిపించింది.

వెంటనే రెడ్‌విల్స్ సిగరెట్ ప్యాకెట్ పట్టుకు రమ్మనమని చెప్పి పంపేశాడు.

"ప్రభాకర్ ఇంట్లో ఏపేయింగ్ గెస్టుగా ఉంటున్నాన్న సంగతి నీకు తెలుసుకదా!"

"ఇప్పుడా ఛాన్సు పోయిందా"?

"అబ్బే అదేంకాదు. అతడి భార్య రూప..."

వాక్యం పూర్తి చేయకుండానే అవతారం కళ్ళల్లోకి దీర్ఘంగా చూసాడుపరమేశం.

"రూపవతి, గుణవతి" మెచ్చుకోలుగా అన్నాడు అవతారం.

"ఆమాట ఎవరూ కాదనలేరు గాని ఆమె ఈ మధ్య నాతో ఎంతో చనువుగా ప్రవర్తిస్తోంది. దానినెల అర్థం చేసుకోవాలో బోధపడటం లేదు. నీకు ప్రభాకర్ సంగతి తెలుసుకదా సప్త వ్యసనపరుడని, ఏ అర్థరాత్రికోగాని ఇల్లు చేరడు. మరి కట్టుకున్న మగడు అలక్ష్యం చేస్తున్నప్పుడు ఎటువంటి ఆడదైనా పట్టాలు తప్పుతుందంటే ఆశ్చర్యమేముంది?"

"చనువుగా అన్నావు అంతవరకు బాగానే ఉంది. మరి ఆ చనువేదో కాస్త వివరంగా వినిపిస్తే సలహా ఇవ్వడానికి అవకాశముంటుంది" అన్నాడు అవతారం చికెన్ ప్లేటు దగ్గరకు లాక్కుంటూ.

"రూప ప్రభాకర్ ఎదుటే నాతో క్లోజుగా మూవ్ అవుతూ మాటలతో చేష్టలతో నన్ను కవ్విస్తోంది. భోజనం వడ్డించేటప్పుడు కావాలని పమిట జార్చడం నా కళ్ళారా గమనించాను. ఆమె నయనాలలో ఏదో తృష్ణ. రూప రూపం నా మెదడులో చెరగని ముద్రగా నిలిచిపోయింది. లైన్ క్లియరయినా మరో అడుగు ముందుకు వేయలేకపోతున్నాను. పైగా కొలీగ్ భార్య అనే భావన నా ప్రయత్నాన్ని నిరోధిస్తోంది". అంటూ మనసులోని బాధనంతా వెళ్ళగక్కాడు పరమేశం.

"ప్రభాకర్ వలన ఆమెకేమాత్రం సుఖంలేదని నీ మాటలలో తేటతెల్లమై పోయింది. ఆమె కిప్పుడు మగతోడు అవసరం. అందుబాటులో నువ్వు ఉన్నావు. ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని ఆమె ఉబలాట పడుతోంది. వనిత తానై వలచి వచ్చినపుడు కాదంటే మహా పాపం. పైగా నువ్వు ఒంటరివాడివి వయస్సులో వున్నావ్. వచ్చిన ఛాన్సు విడువక నీ కోరిక తీర్చుకుని ఆమెకు ఆనందాన్ని ఇవ్వు." హితోపదేశం చేసి రెండో రౌండుకు సిద్ధమయ్యాడు అవతారం.

ఇరువురూ మౌనంగా రెండు రౌండ్లు ముగించారు.

బేరరు బిల్లు ప్లేట్లోపెట్టి పట్టుకొచ్చాడు రెండొందల అరవై రూపాయలు.

బిల్లులోని అంకె చూసేసరికి అవతారం కళ్ళు జిగేలుమన్నాయి.

అవతారం సలహా ముందు ఆ బిల్లు ఎంతో చిన్నదిగా కనిపించింది పరమేశానికి.

ఇరువురూ హోటల్ నుండి బయటపడేసరికి రాత్రి పది గంటలు దాటింది.

అవతారానికి వీడ్కోలిచ్చి మరో అవతారం ఎత్తేందుకు ప్రభాకర్ ఇంటికి బయలుదేరాడు పరమేశం.

కాలింగ్ బజర్ మోగించడంతో పడుకున్న రూప లేచి తలుపు తీసింది.

నలిగిన చీరతో, చెదిరిన ముంగురులతో ముచ్చటగా కనిపించింది రూప.

చిరునవ్వు చిందిస్తూ గుమ్మం వద్దే నిలబడ్డాడు పరమేశం.

'అక్కడే ఉండి పోయారేం లోపలకు రండి' అంది రూప.

'ప్రభాకరం...' మాట పూర్తి చేయలేక పోయాడు పరమేశం. అతడి గొంతుక అదుర్తోంది. పెదవులు తడి ఆరిపోయాయి.

'మీకు తెలియందేముంది పన్నెండు దాటితేగాని ఆయనకు ఇల్లు గుర్తుకు రాదు. పేకాట మత్తు ముందు భార్య, సంసారం అన్నీ బలాదూరే' స్థానభ్రంశం చెందిన పయిటను నిలకడగా వుంచేందుకు విశ్వ ప్రయత్నం చేస్తూ అన్నది రూప.

ఆమెను చూస్తూ మాటలు రాక గుటకలు వేయసాగాడు పరమేశం.

"ఇంత రాత్రివేళ వచ్చారంటే ఏదో విశేషమే వుంది" అతడితో పాటు లోపల కొస్తూ అంది రూప.

ఆమె మాటలు వింటూ వుంటే 'బెడ్ రూముకి పద' అన్న అర్థం స్ఫురిస్తోంది.

అంతే, ఆమెను దగ్గరకు తీసుకుని గుండెలకు హత్తుకున్నాడు పరమేశం.

గభాలున అతడి పట్టునుండి విడిపించుకుని దూరంగా జరిగింది రూప.

ముచ్చెమటలు పోసాయి పరమేశానికి 'క్షమించు పరమేశం నేను నీతో తీసుకున్న చనువు ఏదో ఒక రోజు ఇలా పరిణమిస్తుందని నాకు తెలుసు. ఐనా నేనలా నటించక తప్పలేదు.'

'నటనా?!'

'ఔను నటనే. ఇల్లాలి విలువ, అవసరం గుర్తించ కుండా ఇరవై నాలుగు గంటలు బయట గడిపే నా భర్తకి కనువిప్పు కలగడం కోసం నీతో చనువుగా ప్రవర్తించాను.

ఆయన నా మీద అనుమానంతోనైనా ఇంటి పట్టున వుంటాడని ఆశించాను. నా నటన అతడి ప్రవర్తనలో మార్పు తీసుకు రాగలదని కలలు కంటున్నాను. అంతేగాని భర్త ముందే మరొకరితో కులకాలన్న స్వభావం కాదు నాది. కేవలం శారీరక వాంఛలకు అమ్ముడుపోయేటంత బలహీనమైన మనస్సు కాదు నాది." అన్నది రూప చెమర్చిన కళ్లను చీర కొంగుతో వొత్తుకుంటూ.

వారి సంభాషణ వింటూ అచేతనంగా గుమ్మం ముందు నిలబడిపోయాడు అప్పుడే లోపలికి వచ్చిన ప్రభాకరం.

● *ఉదయం వీక్లీ 12.1.90* ●

*(దీపావళి కథల పోటీలో సాధారణ ప్రచురణకు స్వీకరించిన కథ)*